## ఐక్యతతోనే హక్కుల సాధన

- మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ



కమిటీని సన్మానిస్తున్న జిల్లా, మండల నాయకులు

కాసిపేట, ఏప్రిల్ 2 : మున్నూరు కాపులు ఐక్యంగా ఉండాలని, అప్పుడే హక్కుల సాధన సాధ్యమవుతుందని ఆ కుల సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ పటేల్ స్పష్టం చేశారు. కాసిపేట మండలం దేవాపూర్‌లోని సల్పాలవాగు సమీపంలో శుక్రవారం మున్నూరు కాపు సంఘం మండలాధ్యక్షుడు అట్టెపల్లి శ్రీనివాస్ పటేల్ అధ్యక్షతన మండల నూతన కమిటీని సన్మానించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మిట్ట లచ్చన్న పటేల్‌తో కలిసి సత్యనారాయణ హాజరై, మాట్లాడారు. మున్నూరు కాపు విద్యార్థులకు యేటా పుస్తకాలు, పేదింటి యువతి పెళ్లికి మంగళసూత్రం అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శిని శాలువాలతో సన్మానించారు. మాజీ జడ్పీటీసీ రౌతు సత్తయ్య, జిల్లా అధికార ప్రతినిధి సిద్ధం తిరుపతి పటేల్, జిల్లా యూత్ అధ్యక్షుడు తేండ్ర శ్యామ్ పటేల్, మండల ప్రధాన కార్యదర్శి ఇంగు నారాయణ పటేల్, గౌరవాధ్యక్షుడు అగ్గు శ్రీనివాస్ పటేల్, సిద్ధం బాపు పటేల్, ఉపాధ్యక్షుడు మచ్చ అశోక్ పటేల్, మడిపల్లి తిరుపతి పటేల్, సిద్ధం రాములు పటేల్, కోశాధికారి పానగంటి రాజేందర్ పటేల్, సంయుక్త కార్యదర్శి సూరం కిషన్ కిషన్, పానగంటి తిరుపతి పటేల్, గుర్రాల వేణు పటేల్, పానగంటి అశోక్ పటేల్, పులుగం మల్లేశ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## 78 శాతం బొగ్గు ఉత్పత్తి



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌చార్జి జీఎం మచ్చగిరి నరేందర్

రెబ్బెన, మే 2 : బెల్లంపల్లి ఏరియాలోని గనులు ఏప్రిల్‌లో 78 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు ఇన్‌చార్జి జీఎం మచ్చగిరి నరేందర్ తెలిపారు. గోలేటి జీఎం కార్యాలయంలో శుక్రవారం ఆయన వివరాలు వెల్లడించారు. 3.50 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 2.74 లక్షల టన్నుల(78 శాతం) బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు తెలిపారు. ఖైరగూడ ఓసీపీలో పనుల కారణంగా ఉత్పత్తి కొంత తగ్గిందన్నారు. సంస్థ నిర్దేశించిన ఉత్పత్తిని అందరి సహకారంతో అధిగమిస్తామని పేర్కొన్నారు. ఏరియా ఎస్‌వోటూ జీఎం రాజమల్లు, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్‌కుమార్‌బెహరా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పీవో ప్రశాంత్ తదితరులున్నారు.

## ఎంవీటీసీలో కనీస సౌకర్యాలు కరువు

శ్రీరాంపూర్, మే 2 : శ్రీరాంపూర్ మైనింగ్ ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్(ఎంవీటీసీ)లో మౌలిక వసతులు లేక ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కే సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్‌లు ఆరోపించారు. శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. ఎంవీటీసీలో రక్షిత మంచినీటి సౌకర్యం కోసం ఆర్వో ప్లాంట్, సిబ్బందికి వాష్, రెస్ట్ రూంలు ఏర్పాటు డిమాండ్ చేశారు. సింగరేణి వ్యాప్తంగా శ్రీరాంపూర్‌లో అత్యధికంగా 8675 మంది ఉద్యోగులు, సుమారుగా 4వేల నుంచి 5వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని చెప్పారు. వారి నైపుణ్యాన్ని పెంపొందించేందుకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బండి రమేశ్, జాయింట్ సెక్రటరీ పానుగంటి సత్తయ్య, కేంద్ర చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పొగాకు రమేశ్, కేంద్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అన్వేష్‌రెడ్డి, కేంద్ర కార్యవర్గ సభ్యులు ఎండీ లాల, ముత్యాల రమేశ్, గోనె స్వామి, గోపి నాయక్ తదితరులు పాల్గొన్నారు.


## జడ్పీసీఈవో ఆకస్మిక తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న జడ్పీసీఈవో గణపతి

మందమర్రి రూరల్, మే 2 : మందమర్రి ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం మంచిర్యాల జడ్పీసీఈవో గణపతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల గురించి, కార్యాలయంలో సిబ్బంది హాజరు పట్టికను, విధుల్లో ఉన్న ఉద్యోగుల వివరాలను ఎంపీడీవో రాజేశ్వర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఇంటి పన్నులు, పంచాయతీ నిర్వహణ, పారిశుధ్య వివరాలు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. విధులపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమయ పాలన పాటించాలని, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రజలకు చేరవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్ వేణుగోపాల్ రావు, సీనియర్ అసిస్టెంట్ గిరిధర్‌రావు, జూనియర్ అసిస్టెంట్ భార్గవి, టైపిస్టు సారయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇద్దరికి 14 రోజుల రిమాండ్



నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్న అటవీ శాఖ అధికారులు

ఆసిఫాబాద్ టౌన్, మే 2 : అడవుల్లో చెట్ల నరికివేతకు పాల్పడిన ఆసిఫాబాద్ మండలం మోవాడ్ గ్రామ పంచాయతీ పరిధి వాడిగొంది గ్రామానికి చెందిన సిడాం మారు, టేకం రాజుకు 14 రోజుల రిమాండ్ విధిస్తూ ప్రిన్సిపల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ అనంతలక్ష్మి శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేసినట్లు జోడేఘాట్ రేంజ్ అధికారి జ్ఞానేశ్వర్ తెలిపారు. చెట్ల నరికివేతకు పాల్పడిన మారు, రాజును అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపర్చామని పేర్కొనారు. కాగా, వారిని స్థానిక సబ్ జైలుకు తరలించిట్లు తెలిపారు. అడవుల నరికివేతకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అడవుల సంరక్షణలో ప్రజలు సిబ్బందికి సహకరించాలని కోరారు. అక్రమ నరికివేతలకు సంబంధించి ప్రతి కేసునూ కోర్టులో అప్పగిస్తున్నట్లు వివరించారు. మోవాడ సెక్షన్ ఆఫీసర్ సంతోష్, బీట్ అధికారి అమరేందర్, శ్రీనివాస్, రాజేశ్ పాల్గొన్నారు.

## యువకుడి ఆత్మహత్య

మంచిర్యాల అర్బన్, మే 2 : సీసీసీ నస్పూర్ ఏరియా తీగల్‌పహాడ్‌కు చెందిన దుర్గాప్రసాద్ (28) శుక్రవారం రవీంద్రఖని–మంచిర్యాల రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ ఎస్ఐ మహేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. దుర్గాప్రసాద్ ఆర్థిక ఇబ్బందులతో మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో విరక్తి చెందిన రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి శంకరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

# లక్ష్యాలు త్వరగా పూర్తి చేయాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



మందమర్రి రూరల్ : అందుగులపేటలోని రైస్ మిల్లును పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మందమర్రి రూరల్, మే 2 : రైసు మిల్లులకు కేటాయించిన వరిధాన్యం లక్ష్యాలను త్వరగా పూర్తిచేయాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మందమర్రి మండలం అందుగులపేటలోని అంబికాసాయి, వాసవి, లక్ష్మీగణపతి, వెంకటేశ్వర రైస్ మిల్లులను శుక్రవారం తహసీల్దార్ సతీశ్‌కుమార్‌తో కలిసి సందర్శించారు. నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు నీడ, తాగునీరు, ఓఆర్ఎస్ సౌకర్యాలను సమకూర్చడం జరుగుతుందన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైసుమిల్లులకు తరలించనున్నట్లు తెలిపారు. రైసుమిల్లర్లు తమకు కేటాయించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి, ఉద్యోగుల హాజరు పట్టిక పరిశీలించారు. అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజలతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ వేగవంతం చేసి, జాబితా రూపొందించాలని పేర్కొన్నారు. కలెక్టర్ వెంట రైస్ మిల్లుల యాజమానులు తదితరులున్నారు.

### వడదెబ్బ నివారణపై అవగాహన సదస్సులు

నస్పూర్, మే 2 : వడదెబ్బ నివారణ, జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుటున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖతో పాటు, ఇతర శాఖల జిల్లా అధికారులు వారి శాఖల ప్రణాళికలకు అనుగుణంగా వడదెబ్బ నివారణపై ప్రజలకు తెలియజేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎవరికైనా వడదెబ్బ తగిలితే సమీపంలోని ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లాలని తెలిపారు.

### క్రీడాకారుడికి సన్మానం

అంతర్జాతీయ బ్యాడ్మింటన్ టోర్నీకి ఎంకైన జిల్లా క్రీడాకారుడు రాజలింగును కలెక్టర్ కుమార్ దీపక్ సన్మానించారు. ఇటీవల గోవాలో జరిగిన జాతీయస్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో 75 ప్లస్ కేటగిరీ సింగిల్స్, డబుల్స్ విభాగంలో కాంస్య పతకం సాధించాడు. కాగా, కలెక్టర్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ టోర్నీకి ఎంపికవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం రాజలింగుకు బ్యాడ్మింటన్ సంఘం తరుపున రూ.20 వేల చెక్కు అందజేశారు. బ్యాడ్మింటన్ అకాడమీ చైర్మన్ మధుకుమార్, ప్రతినిధులు వెంకటేశ్వర్లు, శంకర్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

### కేటాయించిన ఇండ్లలోనే ఉండాలి..

మందమర్రి, మే 2 : మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులు తమకు కేటాయించిన ఇండ్లలో తప్పని సరిగా ఉండాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. స్థానిక అధికారులతో కలసి మున్సిపాలిటీ పరిధిలోని ప్రాణహిత కాలనీ సమీపంలో గల డబుల్ బెడ్రూం ఇండ్లను సందరిశంచారు. ఇండ్లలో మిగిలి ఉన్న పనులు త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సతీశ్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

## వాటర్ ఫిల్టర్, ఫ్రిడ్జ్ ప్రారంభం



ఆర్వో వాటర్ ఫిల్టర్‌ను ప్రారంభిస్తున్న ఏఎస్పీ చిత్తరంజన్

ఆసిఫాబాద్ టౌన్, మే 2 : పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన ఆవరణలో శుక్రవారం రోగుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్, ఫ్రిడ్జ్‌ను ఏఎస్పీ చిత్తరంజన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దవాఖానకు వచ్చే రోగులు, వైద్య సిబ్బంది కోసం ఆర్వో వాటర్ ఫిల్టర్, ఫ్రిడ్జ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణతో పాటు, ప్రజాసేవ కార్యక్రమాలు చేయడంలో జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. వేసవి దృష్ట్యా డివిజన్‌లోని ప్రతీ మండల కేంద్రంలో పోలీసు అధికారులతో చలివేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. పట్టణ సీఐ రవీందర్, ఎస్ఐలు అంజన్న, ప్రశాంత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సభా స్థలి ఏర్పాట్ల పరిశీలన



కాగజ్‌నగర్ క్రాస్‌రోడ్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

రెబ్బెన, మే 2 : రెబ్బెన మండలం కాగజ్ నగర్ క్రాస్‌రోడ్ వద్ద 5వ తేదీన 363 జాతీయ రహదారి ప్రారంభోత్సవం సందర్భంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ బహిరంగ సభాస్థలి, హెలీప్యాడ్ ప్రాంతాలను శుక్రవారం కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే పరిశీలించారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఏఎస్పీ ప్రభాకర్‌రావు, పీడీ అజయ్ మణికుమార్‌తో కలిసి పర్యటించారు. సమావేశం జరిగే ప్రాంతాలను పరిశీలించి, సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామ్మోహన్‌రావు, ఎస్ఐ చంద్రశేఖర్, డీఈ లక్ష్మీనారాయణ, ఏఈ ఇమ్రాన్, ఈవెంట్ మేనేజర్ అనూప్ ఉన్నారు.

## తాగునీటి సమస్య లేకుండా చూడాలి




అధికారులకు సూచనలు చేస్తున్న డీపీవో వెంకటేశ్వర్‌రావు

జైపూర్, మే 2 : గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని మంచిర్యాల జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు అధికారులకు సూచించారు. జైపూర్ మండలంలోని ఇందారం, టేకుమట్ల, కిష్టాపూర్, వేలాల గ్రామాల్లో శుక్రవారం అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగించాలని, ప్లాస్టిక్ ఎక్కడా ఉండకూడదని సూచించారు. మురుగు కాలువల్లో పేరుకున్న మట్టి పూర్తి స్థాయిలో తొలగించాలని తెలిపారు. పంచాయతి రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో బాపు, ఆయా జీపీల పంచాయతీ కార్యదర్శులు సుమన్, శ్రావణి, ప్రశాంత్, రాము తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకు ఇండ్లు కేటాయించాలి



కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

మందమర్రి, మే 2 : క్యాతనపల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీ కోసం ప్రకటించిన జాబితాలో జరిగిన అవకతవకలను సవరించి, అర్హులకు కేటాయించాలని బీఆర్ఎస్ పార్టీ చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రాజారమేశ్ డిమాండ్ చేశారు. రెండు రోజుల క్రితం ప్రకటించిన జాబితాలో చోటు చేసుకున్న అవకతవకలు సవరించాలని కోరుతూ శుక్రవారం కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ పర్యవేక్షణలో అర్హులను గుర్తించినట్లు గుర్తుచేశారు. వారి పేర్లు ప్రస్తుత జాబితాలో లేవని, అలాగే సొంత ఇండ్లు ఉన్నవారిని అర్హులుగా ప్రకటించారని ఆరోపించారు. మున్సిపాలిటీలో 286 ఇండ్లు నిర్మించగా, 235 ఇండ్లను పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారని, మిగతా 50 ఇండ్లను చేర్చకపోవడంలో ఆంతర్యమేమిటని వారు ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు వారి స్వలాభం కోసం వారి కార్యకర్తల పేర్లను జాబితాలో చేర్చారని ఆరోపించారు. నాయకులు రామిడి కుమార్, అనిల్ కుమార్, బడికెల సంపత్, నందిపేట సదానందం, రామిడి లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు జీఎం అభినందనలు



విద్యార్థులను సన్మానిస్తున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్, మే 2 : పదోతరగతిలో 500కు పై మార్కులు సాధించిన శ్రీరాంపూర్ సింగరేణి ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులను శుక్రవారం శ్రీరాంపూర్ జీఎం ఎం శ్రీనివాస్ అభినందించారు. 62 మందికి 61 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ, డీవైజీఎం పర్సనల్ అరవిందరావు, పాఠశాల కరస్పాండెంట్ రాజేశ్వర్, హెచ్‌ఎం సంతోష్, ఉపాధ్యాయులు లక్ష్మయ్య, అనురాధ, శ్రీపతిరావు, శ్రావణ్ పాల్గొన్నారు.

## సద్వినియోగం చేసుకోవాలి



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఐటీడీఏ అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉద్ధవ్

ఆసిఫాబాద్ టౌన్, మే 2 : జిల్లా కేంద్రంలోని ఆశ్రమ బాలికల స్పోర్ట్స్ పాఠశాలలో శుక్రవారం ప్రారంభించిన స్టీమ్ ల్యాబ్‌ను విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉద్ధవ్ సూచించారు. శుక్రవారం ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జంగు, సీవైడీఏ సంస్థ ప్రతినిధులు నరేశ్, బాలకృష్ణ, రవీందర్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



షీ టీంపై అవగాహన కల్పిస్తున్న సభ్యులు

## షీ టీంపై అవగాహన

నస్పూర్, మే 2 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సైన్స్ సెంటర్‌లో శుక్రవారం షీ టీంపై విద్యార్థులకు సభ్యులు అవగాహన కల్పించారు. ఆకతాయిల ఆట కట్టించి మహిళలకు రక్షణ కల్పించడమే షీ టీం కర్తవ్యమని తెలిపారు. వేధింపులకు గురైతే 63039 23700 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. షీ టీం సభ్యులు శ్రావణ్, జ్యోతి, శ్రీలత, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు అవగాహన



చింతగూడలో ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

జన్నారం, మే 2 : మండలంలోని చింతగూడలో శుక్రవారం ఉపాధి హామీ కూలీలకు ఆర్థిక అక్షరాస్యతా కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. బ్యాంక్ ఖాతాలు, ఆర్థిక ప్రణాళిక, డిజిటల్ ఖాతాలు, రుణ సౌకర్యాలతో బీమా, పెన్షన్ ఉత్పత్తులు, వృద్ధులు వికలాంగులకు ఇంటి వద్దనే సౌకర్యాలు కల్పించడంపై వివరించారు కౌన్సిలర్ రవీందర్, హరీశ్, నూతన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డీఎం బాధ్యతలు



డీఎం శ్రీనివాసులు

మంచిర్యాలటౌన్, మే 2 : మంచిర్యాల ఆర్టీసీ డిపో మేనేజర్‌గా టీ శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వరంగల్–1 డిపో అసిస్టెంట్ ఇంజినీర్ (మెకానికల్)గా పనిచేసిన ఈయన, ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన డీఎం ఎస్ జనార్దన్ ఏప్రిల్ 30న విరమణ పొందారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఎం శ్రీనివాసులుకు డిపో అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి, స్వాగతం పలికారు. అందరి సహకారంతో ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు

ఆసిఫాబాద్ టౌన్, మే 2 : రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రత్ల దృష్ట్యా తెలంగాణ మహిళ, శిశు సంక్షేమ శాఖ ఉత్తర్వుల మేరకు 3 నుంచి 31వ తేదీ వరకు కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించినట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రం నుంచి ప్రతి రోజు పౌష్టికాహారం పొందుతున్న గర్భిణులు, బాలింతలు, పిల్లలకు నెలకు సరిపోయేలా రేషన్‌ను అంగన్‌వాడీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అందిస్తుందని పేర్కొన్నారు.

## జ్వరాలతో అప్రమత్తంగా ఉండాలి

వాంకిడి, ఏప్రిల్ 2 : గ్రామాల్లో ప్రజలు జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని వాంకిడి ప్రభుత్వ ఉన్నత శ్రేణి దవాఖాన విస్తరణ అధికారి రవిదాస్ సూచించారు. మండలంలోని సోనాపూర్, చిచ్చుపల్లి గ్రామాల్లో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. గతేడాది మలేరియా పీడిత గ్రామాలను గుర్తించి, 30 మందికి రక్త పరీక్షలు సేకరించినట్లు తెలిపారు. రక్తనమూనాలు ప్రయోగశాలకు పంపించినట్లు పేర్కొన్నారు. ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, గ్రా మస్తులు తదితరులున్నారు.

## మున్నూరు కాపు గ్రామ కమిటీ

కాగజ్‌నగర్, మే 2 : కాగజ్‌నగర్ మండలం చింతగూడ, కోయవాగు మున్నూరు కాపు గ్రామ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సత్యం శెట్టి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా బర్ల కిరణ్ కుమార్, కోశాధికారిగా రాచకొండ జగ్గారావు, కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. నూతన కమిటీని గ్రామస్తులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో కుల పెద్దలు సురేశ్, మల్లేశ్, కొండయ్య, దేవయ్య, మధునయ్య, యువకులు వినోత్, ప్రశాంత్, మల్లేశ్ పాల్గొన్నారు.

## జాతీయ రహదారిని పొడిగించాలి



ఎంపీకి వినతి పత్రం ఇస్తున్న అభివృద్ధి కమిటీ కన్వీనర్

జన్నారం, మే 2 : నిర్మల్ జిల్లా ఖానాపూర్ నుంచి కడెం, జన్నారం, దండేపెల్లి, లక్షెట్టిపేట వరకు జాతీయ రహదారిని పొడిగించాలని కోరుతూ మండలాభివృద్ధి కమిటీ కన్వీనర్ శ్రీరాముల కొండయ్య ఆధ్వర్యంలో ఆదిలాబాద్ ఎంపీ నగేశ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు వినతి పత్రం అందించారు. అలాగే మండల కేంద్రంలో 30 పడకల దవాఖాన నిర్మించాలని, ఆదిలాబాద్, నిర్మల్ నుంచి భారీ వాహనాల రాకపోకలు పునరుద్ధరించాలని, అటవీ శాఖ ఆంక్షలను వెంటనే ఎత్తివేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కో కన్వీనర్ కోడూరి చంద్రయ్య, ఆర్టీసీ ఎంప్లాయీస్ నాయకుడు షబీర్‌పాషా(ఎంఎస్‌పాషా), బీసీ సంఘం అధ్యక్షుడు గూడ అంజన్న, పెరక సంఘం అధ్యక్షుడు ఎంబడి సత్తన్న, షేక్ అక్బర్ పాల్గొన్నారు.

## బంద్ విజయవంతం చేయాలి

శ్రీరాంపూర్, మే 2 : అన్ని పార్టీల ఆధ్వర్యంలో శనివారం చేపట్టే మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా బంద్‌లో ప్రజలు, వ్యాపారులు పాల్గొని విజయవంతం చేయాలని నస్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ సుర్మిల్ల వేణు, జిల్లా మాజీ యూత్ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, నస్పూర్ మండల యూత్ అధ్యక్షుడు నరిగె నరేశ్ పిలుపునిచ్చారు. శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం వారు మాట్లాడారు. పహల్గాం ఉగ్రదాడిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. బంద్‌కు కాంగ్రెస్ మద్దతిస్తున్నదని పేర్కొన్నారు. సమావేశంలో పట్టణ మహిళా అధ్యక్షురాలు పుట్ట యశోద, మైనార్టీ సెల్ మండలాధ్యక్షుడు ఖలీద్, పార్టీ జిల్లా కార్యదర్శి భూపతి శ్రీనివాస్, నాయకులు కొండ్ర లింగయ్య, వంశీ, చెక్రీన్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా అమలు


దండేపల్లి, మే 2 : పారదర్శకంగా రాజీవ్ యువ వికాసం పథకం అమలుకు కృషి చేస్తామని డీఆర్డీవో కిషన్ అన్నారు. దండేపల్లి ఎంపీడీవో కార్యాయంలో శుక్రవారం రాజీవ్ యువ వికాసం పథకానికి జీపీల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ అధికారి, మండల ప్రత్యేకాధికారి దుర్గాప్రసాద్, బీసీ కార్పొరేషన్ అధికారి పురుషోత్తం, ఎంపీడీవో ప్రసాద్ తదితరులున్నారు.

## లబ్ధిదారుల జాబితా ప్రదర్శన

కౌటాల, మే 2 : మండలంలోని అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుల జాబితాను శుక్రవారం గ్రామాల్లోని అన్ని పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించారు. లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు కార్యదర్శులు తెలిపారు. కాగా, అర్హులకు ఇండ్లు రాలేదని పలు గ్రామాల్లో ప్రజలకు కార్యదర్శుల తీరుపై ఆరోపణలు చేస్తున్నారు.

## బీసీ ఉద్యమకారుడికి సన్మానం

మంచిర్యాల (ఏసీసీ), మే 2 : కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టడంలో ఉద్యమాల ద్వారా కీలక పాత్ర పోషించిన బీసీ ఉద్యమకారుడు గుమ్ముల శ్రీనివాస్‌ను శుక్రవారం జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నేతలు సన్మానించారు. బీసీ నేత శ్రీనివాస్ అనేక ఏళ్లుగా బీసీ రాజ్యాధికారమే అంతిమ లక్ష్యంగా పోరాడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రఘునందన్, పల్లె భూమేశ్, కర్రె లచ్చన్న, శాఖపూరి భీంసేన్, శ్రీపతి రాములు తదితరులు పాల్గొన్నారు.



బీసీ నేత శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు